

నేడు బీచ్ గేమ్స్ రాష్ట్ర జట్టు ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఖేలో ఇండియా రెండో విడత బీచ్ గేమ్స్-26లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 19న నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని కృష్ణా రివర్ బేసిన్ (మణిపాల్ హాస్పిటల్ వద్ద) వేదికగా బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, బీచ్ సెపక్ తక్రా, బీచ్ సాకర్ అంశాల్లో పురుషులు, మహిళలకు విడివిడిగా ఈ ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలు ఓపెన్ కేటగిరీలో నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతీ యువకులు, ఉద్యోగులు ఎవరైనా పాల్గొనవచ్చునని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 19న ఉదయం 8 గంటలకు నిర్ణీత వేదిక వద్ద రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 7680075375 నంబరులో సంప్రదించాలని కోరారు.

పెద్దల మేత... రైతులకు కోత

- ధాన్యం మద్దతు ధరలో కొంత మినహాయింపు
- అసోసియేషన్‌కు ఇచ్చిన డబ్బులను రాబట్టుకుంటున్న మిల్లర్లు
- రైస్‌మిల్లర్స్ సంఘం వసూళ్ల దందా ఫలితం

రైస్‌మిల్లర్ల అసోసియేషన్ పెద్దల దందా ఫలితంతో అంతిమంగా రైతులే నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. తోటి రైస్ మిల్లర్ల నుంచి అక్రమంగా లక్షలాది రూపాయలను వసూలు చేస్తుండడంతో, ఆ మేరకు తమపై పడుతున్న భారాన్ని మిల్లర్లు రైతుల నుంచే రాబట్టించుకుంటున్న పరిస్థితి ఉంది. అసోసియేషన్ నిర్వహణకు మూడు శాతం కమీషన్ ఇస్తున్నప్పుడే రైతుల నుంచి తేమ శాతం పేరుతో అదనపు ధాన్యం తీసుకోవడం, మద్దతు ధరలో కోత పెట్టడం సర్వసాధారణంగా ఉంది. ఇప్పుడు పది శాతం కమీషన్ చెల్లించాలని అసోసియేషన్ నేతలు నిబంధన పెట్టడంతో, ఆ మేరకు రైస్ మిలర్లు కూడా రైతుల నుంచి ఆ నష్టాన్ని రికవరీ చేసుకునే పనిలో మిల్లర్లు నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకు సుమారు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సిఎంఆర్ (కస్టమ్ రైస్ మిల్లింగ్) కోసం 270 రైస్ మిల్లులను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లోనే అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పెద్దలు పది శాతం కమీషన్ ఇవ్వాలని షరతు పెట్టడం, అలా డబ్బులు చెల్లించని వారికి ధాన్యం ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి చేయడంపై కొంతమంది మిల్లర్లు అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. మిల్లర్ల పెద్దతో పాటు స్వయంగా ఈ దందాలో అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత సోదరుడు ఉండడంతో, దాదాపుగా మిల్లర్ల అంతా వారు అడిగిన మేరకు సొమ్ములు సమర్పించుకున్నారు. ధాన్యం సిఎంఆర్ చేసినందుకు ప్రభుత్వం ఇచ్చిన బిల్లుల పైనే మిల్లుల మనుగడ ఆధారపడిన నేపథ్యంలో ఒక్కసారి పది శాతం కమీషన్ మేర సొమ్ములు చెల్లించాల్సి రావడం వారికి గుదిబండగా మారింది. ఇప్పుడు వారు ఆ భారం నుంచి బయటపడడానికి రైతుల నుంచి రాబట్టించుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

రైతుల నుంచి దోపిడీ ఇలా...

ప్రభుత్వం ధాన్యం సేకరణను సంక్లిష్టంగా మార్చడంతో కొనుగోలు, రైతుసేవా కేంద్రాలకు పదేపదే తిరగలేక రైతులు సమీపంలోని మిల్లులు, దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా దళారులు, కొంతమంది మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. 80 కేజీల బస్తాకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం రూ.1895.20 చెల్లించాల్సి ఉంటుంది. చాలాచోట్ల రూ.1650 నుంచి రూ.1750 మధ్య చెల్లిస్తున్నారు. ధాన్యం తూకంలోనూ రైతులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి నెలకొంది. తేమ శాతం ఉందనే సాకుతో బస్తాకు అదనంగా నాలుగు నుంచి ఐదు కేజీల వరకు తీసుకుంటున్నారు.



ధాన్యం అమ్ముకోవడానికి బస్తాలను సిద్ధం చేస్తున్న రైతులు

ఆరు కేజీలు అదనంగా అడిగారు



నేను ఎకరా 20 సెంట్లలో వరి వేశాను. 32 బస్తాల ధాన్యం వచ్చింది. మిల్లరును కలిస్తే 86 కేజీలు ఇవ్వాలన్నారు. మాకు తెలిసిన ఓ వ్యక్తి నాలుగు కేజీలే అడగడంతో అతనికే ఇచ్చేశాను. బస్తాకు రూ.1750 చొప్పున అమ్ముకోవాల్సి వచ్చింది.

- పాడి శ్రీనివాసరావు, వైపర్త (బూర్జ)

తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది



ప్రభుత్వం చెప్పున్న మద్దతు ధర రైతులకు దక్కడం లేదు. రైతు సేవా కేంద్రాలు, కొనుగోలు కేంద్రాలకు తిరగలేక మిల్లుకు ఇచ్చేయాలని అనుకున్నాను. 80 కేజీల బస్తాకు అదనంగా ఆరు కేజీలు అడిగారు. దీంతో మాకు తెలిసిన వ్యక్తికి బస్తా రూ.1750కి అమ్మాను. బస్తాకు అదనంగా 2.50 కేజీలు ఇవ్వాల్సి వచ్చింది.

- ఆర్.పట్టాభినాయుడు, కిలంతరి, బూర్జ



సంఘీభావం తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'ఉపాధి' చట్టం మార్పుపై రేపు నిరసనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉపాధి హామీ చట్టంలోని మార్పులను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఈనెల 20వ తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో పాటు మండల కేంద్రాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం, ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసి, దాన్ని స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ (విబిజిరాంజి) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని ఖండించారు. కార్మికులు, కార్మిక సంఘాలతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై నడిచే విధంగా మార్చుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చడం గాంధీ మహాత్ముని అవమానించడమేనన్నారు. గాంధీని చంపిన గాడ్సే వారసులకు ఈ పేరు మార్పు వల్ల సంతోషంగా ఉండొచ్చు గానీ, దేశంలో కోట్లాది మంది ఉపాధి వేతనదారుల పొట్టలు కొడుతున్నారని గుర్తు పెట్టుకోవాలన్నారు. చట్టాన్ని మార్చే ఉత్సాహం కంటే ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 కూలి చెల్లించి, రూ.2.58 లక్షల కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ అమలు బాధ్యత రాష్ట్రాలకు 40 శాతం అప్పగించడమంటే ఉపాధి హామీ చట్టాన్ని ప్రజలకు దూరం చేయడమే అవుతుందన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం నూతన బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మీనారాయణ, కెవిపిఎస్ నాయకులు బొమ్మాళి రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జెడ్‌పి సర్వసభ్య సమావేశం



శ్రీకాకుళం సిటీ: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యే ఈ సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్
- కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, పలు రకాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతరావు కిషోర్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును అనుసరించి ప్రతి ఉపాధ్యాయులు టెట్ పరీక్ష తప్పనిసరిగా పాస్ కావలసి ఉందన్నారు. 2010కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు డిఎస్‌సి పరీక్ష ద్వారా నియామకమైన వారు, పాఠశాల విద్యాశాఖ నిర్వహించే ప్రతి శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటున్న వారు, ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలనే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉపాధ్యాయులందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని అన్నారు. వెంటనే సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. 2025 జూన్‌లో బదిలీ కోరుకున్న వందలాది ఉపాధ్యాయులు నేటికీ రిలీవింగ్ నోచుకోలేదని అన్నారు. వారి స్థానంలో ఎకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు నియమించి ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. సింగిల్ టీచర్స్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే దానికి అవకాశం కల్పించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులపై గిరిజ సంక్షేమ అధికారుల పైనుంచి కింది అధికారుల వరకు తీవ్ర నిర్బంధాన్ని విధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల మరణాలకు బాధ్యులను చేస్తూ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నేరుగా ఇంక్రిమెంట్లు పాత విధిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వందరోజుల ప్రణాళిక నుంచి ఆదివారం, రెండో శనివారం, పండగ దినాలను మినహాయించాలన్నారు. రోజూ పరీక్షలు నిర్వహించి అదే రోజు మార్కులు అప్‌లోడ్ చేయాలనే ఒత్తిడిని తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించరాదన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా సహాధ్యక్షులు వై.ఉమాశంకర్, జిల్లా కోశాధికారి పి.సూర్యప్రకాశరావు, జిల్లా కార్యదర్శులు బి.శంకరరావు, హనుమంతు అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల నిగ్గు తేలేనా..?

ధాన్యం అక్రమాలపై విచారణ చేపట్టిన ఇద్దరు సభ్యుల కమిటీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఇద్దరు కమిటీ సభ్యుల బృందం శ్రీకాకుళం నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టింది. తొలుత అసోసియేషన్ బాధిత మిల్లరు తమ్మినేని నాగభూషణరావుతో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలను ఆయన వివరించారు. తమకు 2024లో 32,908 మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం ఇచ్చారని, ఈ ఏడాది మొదటి విడత కింద కేవలం 12,990 మెట్రిక్ టన్నుల మాత్రమే ఇచ్చారని వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ మిల్లుకు టార్గెట్ వేయాలని కలెక్టర్ రెండు పర్యాయాలు ఆదేశించినా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వేణుగోపాల్ వేయలేదన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ దృష్టికి మరోసారి తీసువెళ్లడంతో జిల్లా మేనేజర్‌ను పిలిచి టార్గెట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారని తెలిపారు. స్వయంగా జెసి లాగిన్ నుంచే తనకు టార్గెట్ వేశారని వివరించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ తీరుతో చాలామంది మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 29 టన్నుల లోడుకు రూ.2,500 అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ధాన్యం కేటాయింపుల్లో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించి కొన్ని ఆధారాలను అందించారు. తర్వాత లిఖితపూర్వకంగా ఒక కాగితంపై రాసిచ్చారు. కమిటీలో మేనేజర్లు సుశీల, శిరీష ఉన్నారు.

అసోసియేషన్ పెద్దల హడావుడి

జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో విచారణ చేపడుతున్న సమయంలో అసోసియేషన్ పెద్దల హడావుడి కనిపించింది. ధాన్యం కేటాయింపుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయానికి ఇద్దరు సభ్యుల విచారణ బృందం గురువారం జిల్లాకు వస్తున్నారన్న సమాచారం చేరిపోవడంతో, మిల్లర పెద్దతో పాటు అసోసియేషన్‌కు చెందిన కొందరు నాయకులు కమిటీ రాకమునుపే జిల్లా కార్యాలయానికి వచ్చేశారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ టి.వేణుగోపాల్ ఛాంబర్‌లో గంటల కొద్దీ చర్చించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో నిర్వహించిన కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం సిటీ



'ద రోల్ ఆఫ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (ఐకెసి) ఇన్ ఇండియన్ కల్చర్ అండ్ రెలిజియన్: ఫెర్స్‌ఫెక్టివ్ ఆఫ్ కె.ఎస్.మూర్తి' అనే అంశంపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సెమినార్‌ను ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు గురువారం ప్రారంభించారు.

- ప్రజాశక్తి, ఎచ్చెర్ల

నాణ్యమైన వైద్యం అందించాలి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - లావేరు

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడం వైద్యుల కర్తవ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఆధునీకరించిన మండలంలోని మురపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ సత్తి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న పిహెచ్‌సిలను అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేబొరేటరీల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారని, ఆస్పత్రిలోనే ప్రసవాలు చేస్తారని చెప్పారు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ (హెల్త్) సత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 19 పిహెచ్‌సిలను ఇదేరకంగా ఆధునీకరణ చేశామని, మరో ఐదు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నర్సింగ్ స్టాఫ్‌కి ప్రసవాలు, అత్యవసర చికిత్స అందించడానికి నైపుణ్య శిక్షణను అందించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అసోసియేట్ డైరెక్టర్ వి.ఆర్ జోగారావు, వైద్యాధికారులు కె.జగదీష్, సురేష్, నవీన్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆధునీకరించిన మురపాక పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ, రెడ్డీస్ ప్రతినిధులు

నిరుద్యోగ యువతకు బిఎస్‌ఎన్‌ఎల్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో బిఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యాన ఉచిత టెలికాం నైపుణ్య శిక్షణా కోర్సులు ప్రారంభం కానున్నాయి. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ చేపట్టిన 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన' పథకం కింద హైదరాబాద్ ఎర్రగడ్డలోని ప్రాంతీయ టెలికాం శిక్షణా కేంద్రంలో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. వైర్‌లెస్ టెక్నీషియన్, బ్రాడ్‌బాండ్ టెక్నీషియన్, ఆప్టికల్ ఫైబర్ టెక్నీషియన్, స్ప్లైసర్ విభాగాల్లో ఐటిఐ పూర్తి చేసిన వారికి, డిప్లమా చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. ఈ నెల 22 నుంచి తరగతులు ప్రారంభం కానుండగా, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబరు 19న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల్లోపు ఆధార్, పాన్‌కార్డులు, విద్యార్హత పత్రాలతో హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆర్‌టిసి కార్యాలయంలో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ వి.వి.వి సత్యనారాయణ ఒక ప్రకటనలో సూచించారు. ముందు వచ్చిన వారికి ప్రాధాన్యం ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగ నియామక సహాయం కూడా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు www.rttchyd.bsnl.co.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

30న తపాలా అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న ఉదయం పది గంటలకు 'తపాలా అదాలత్' నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెల్ల వీధి, ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తపాలా సేవలకు సంబంధించి ఏవైనా వ్యక్తిగత సమస్యలు ఉన్న వారు ఈనెల 29వ తేదీలోపు తమ దరఖాస్తులను 'తపాలా అదాలత్' శీర్షికతో వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం డివిజన్, శ్రీకాకుళం 532001 చిరునామాకు పంపాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. బాధితులు అదాలత్ రోజున వ్యక్తిగతంగా హాజరై కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని తెలిపారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు స్వీకరించబడవని పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్‌లు

- ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలు అందాలి
- ప్రిన్సిపల్ అకౌంట్స్ జనరల్ శాంతి ప్రియ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి జిపిఎఫ్, పెన్షన్ అదాలత్ దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ఎజి కార్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన అదాలత్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించేందుకు రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ కార్యాలయమే నేరుగా ఉద్యోగుల చెంతకు రావడం సంతోషదాయకమన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలో ఇది పదో అదాలత్ అని అన్నారు. ప్రతి కేసును వ్యక్తిగతంగా పరిశీలించి సమస్యలను క్లియర్ చేస్తున్నామని, ఉద్యోగుల ప్రయోజనం కోసం మొత్తం ప్రక్రియను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ విరమణ రోజే ప్రయోజనాలు

ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ మంజూరు పత్రాలను త్వరలోనే ఎలక్ట్రానిక్ పద్ధతిలో అందించనున్నట్లు శాంతిప్రియ ప్రకటించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేగంగా ఇచ్చేందుకు 'ఆర్‌పిబిఎస్' వ్యవస్థను తీసుకొచ్చామని, 20 రోజుల్లోనే ప్రయోజనాలు కల్పించాలన్నది లక్ష్యమని ఉద్ఘాటించారు. చాలామంది ఉద్యోగ విరమణ వరకు వేచి చూసి ప్రతిపాదనలు పంపుతున్నారని, దీనివల్ల జాప్యమవుతోందని తెలిపారు. ఉద్యోగ విరమణకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల నుంచే కొన్ని విభాగాలకు ఎలక్ట్రానిక్ పెన్షన్ చెల్లింపు, ఆర్డర్ పత్రాలను డిజిటల్‌గా అందజేస్తామని ఆమె వివరించారు. నామినేషన్ పత్రాలను సరిగ్గా పూరించకపోవడం వల్ల కూడా జాప్యమవుతోందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానంపై అవగాహన కోసం రూపొందించిన వీడియోను ఉద్యోగులు వీక్షించాలని సూచించారు.

ప్రభుత్వ వ్యయ నిర్వహణలో డ్రాయింగ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డిడిఒలు) జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. ట్రెజరీలకు, ఎజి కార్యాలయానికి మధ్య వారు కీలక వారధిగా ఉండాలని సూచించారు. డిడిఒల అవగాహన కోసం 'గ్రాస్‌రూట్ స్థాయిలో అకౌంటింగ్‌ను బలోపేతం చేయడం' అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. పలువురికి పెన్షన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ ఎస్.మోహనరావు, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.కుషల్ కార్తిక్, సీనియర్ అకౌంట్స్ అధికారులు ఎస్.బాలాజీ, టి.విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, ట్రెజరీ డిడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ అకౌంట్స్ జనరల్ శాంతి ప్రియ తదితరులు

ఘనంగా రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు


మెళియాపుట్టి : కేక్ కట్ చేస్తున్న సాయి గణేష్


కోటబొమ్మాళి : దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న నాయకుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు అని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పుట్టినరోజు వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో 10 విమానాశ్రయాలు కొత్తగా ఏర్పాట్లు 18 నెలల్లో ప్రారంభించారని, 45 దేశాల ఏవియేషన్ అసోసియేషన్ చైర్మన్‌గా రామ్మోహన్ నాయుడును ఎన్నుకున్నారన్నారు. ఉడాన్ యాత్ర ద్వారా విమానా శ్రయాల్లో 10 రూపాయలకే ఆహారం అందించే పథకం, మరిన్ని విమానాశ్రయాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేస్తున్నారని, సిఎస్ఆర్ నిధుల ద్వారా శ్రీకూర్మం పుష్కరిణి ఆధునికీకరణకు రూ.10 కోట్లు నిధులు తెప్పించారని, తీర ప్రాంతాల్లో సోలార్ లాంప్ ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవన విధానం మెరుగుపడే విధంగా కృషి చేశారన్నారు. నాయకులు పైడిశట్టి జయంతి, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పలాస : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష కేక్ కట్ చేశారు. అనంతరం కాశీబుగ్గ సాయిరాం మందిరంలో పేదలకు అన్నదానం చేపట్టారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి చింతామణి ఆలయం ఆవరణలో రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, జడ్ఆర్ యుసిసి సభ్యుడు శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక టిడిపి కార్యాలయంలో రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-సిలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను స్థానిక సర్పంచ్ రవ్వల అనురాధ, టిడిపి మండల ఉపాధ్యక్షులు రవ్వల గణపతిరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా జెమ్స్ సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయి గణేష్ పాల్గొన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బరిసింగి దినకర్, ఎ.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వేచ్ఛావతి ఆలయంలో నిర్వహించిన రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు వేడుకల్లో కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిన బాబ్జి, టిడిపి నాయకులు పత్రి తవిటయ్యా, లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, లీలారాణి, కాళ్ల జయదేవ్, నందికి జాని, ఉనా సంతోష్, బోర యువరాజు, దట్టి శ్రీను, కృష్ణయ్య, ఎస్.శేఖర్, మెరుగు సూర్యనారాయణరెడ్డి, కాళ్ల గోపి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళిలో రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు వేడుకల్లో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డప్పన్న, పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు పాల్గొన్నారు. అలాగే సంతబొమ్మాళి మండల టిడిపి నాయకులు గొట్టిపల్లి తపోవనం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి, గోవిందపురం ఎంపిటిసి మెండ త్రినాథరావు, టిడిపి సోషల్ మీడియా అధ్యక్షుడు బెండి అరుణ్ కుమార్, మండల టిడిపి యువత అధ్యక్షుడు కూచెట్టి భానుప్రకాష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో, టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు బోయిన రమేష్ ఆధ్వర్యాన రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేశారు. అలాగే స్థానిక ప్రకాశనగర్ కాలనీలో టిడిపి నాయకులు మజ్జి కృష్ణారావు, నాయకులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి నాయకులు కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాసరావు, సాసుమంతు ఆనందరావు, దేవాది సింహాద్రి, బాడాన రమణమ్మ, కోరాడ గోవిందరావు, మెట్ట మోహనరావు, మంగి రవణ, మూగి అచ్చెయ్యరెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులో రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు, ఆగతముడి మాధవరావు కేక్ కట్ చేశారు.

నందిగాం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు సందర్భంగా నాయకులు పోలాకి చంద్రశేఖరరావు, ఎం.బాలకృష్ణ, పి.జోగారావు, కె.జయరామ్, టి.మహేష్‌గౌడ్, సింహాచలం, మండపాల మోహనరావు, కె.సతీష్, బి.కృష్ణమ్మ, ఎం.లోకనాథం కేక్ కట్ చేశారు.


శ్రీకాకుళం సిటీ : జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


పలాస : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష


ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శుద్ధి చేసిన తాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటోరీస్ వారి సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటి పాలెంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ తాగునీటి ప్లాంట్‌ను స్థానిక సర్పంచ్ రజినితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి అవసరం ఎంతో కీలకమని, ఆర్ఒ ప్లాంట్ ద్వారా స్థానిక ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలిచేటి సురేష్ కుమార్, నారాయణశెట్టి శ్రీనివాసరావు, దన్నాన మహేష్, వెలిచేటి రామకృష్ణ, జి.త్రినాధరావు, మన్నె లక్ష్మి ప్రసాద్, కొప్పిశెట్టి లక్ష్మణరావు, కొణతం శ్రీధర్, డాక్టర్ రెడ్డీస్ లేబోరేటోరీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


మురుగునీటితో నిండిన కాలువ

మండల పరిధిలో కేశవరావుపేట పంచాయతీలో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కాలంలో నిర్మించారు. వాటితో పాటు డ్రైనేజీ కూడా నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ డ్రైనేజీలో మట్టి పేరుకిపోయి ఆ మురికినీరు ముందుకు వెళ్లే మార్గము లేక ఆ డ్రైనేజీలో నీరు నిలిచిపోవడంతో పాటు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. అంతే కాకుండా ఆ మురికినీటిలో కీటకాలతో పాటు దోమలు కూడా అధికంగా ఉండటంతో మురికి వాసన రావడంతో అక్కడ ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి మొదలవలస అనిల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా గతంలో ఉన్న డ్రైనేజీని పూర్తిగా మూసేయటంతో ఆ మురుగునీరు వెళ్లడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను పరిశీలించి పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బ్యాంకు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని జాడపూడి ఆర్ఎస్‌లో నూతన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుశాఖ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఎపి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ జాడపూడి ఆర్ఎస్ సుమారు 50 గ్రామాలకు కేంద్రంగా ఉండి, 150 మహిళా సంఘాలు, ప్రభుతాస్వస్పత్రి, రైల్వేస్టేషన్, విద్యాసంస్థలు, వర్తక కేంద్రాలు ఉన్నందున బ్యాంకు లావాదేవీలకు అనువైన ప్రాంతమని తెలిపారు. నూతన బ్యాంకు శాఖ ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రీజినల్ మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో బి.మణిచంద్ర ప్రకాష్ (ఎఎంసి చైర్మన్), ఈ.సంతోష్‌కుమార్ (ఎంపిటిసి ప్రతినిధి), శ్రీనివాసరావు (జెడ్ఆర్‌సిసి మెంబర్) పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న శ్రీరామ్మూర్తి

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి- కవిటి

కవిటి నుంచి సముద్ర తీర మార్గానికి చేరుకునే ప్రాంతంలో ఆహ్లాదకరంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ చొరవతో తెలంగాణ బిసి నాయకుడు, శ్రీకాకుళం జిల్లా వాసి బొడ్డేపల్లి శ్రీరామ్మూర్తి రూ.51,116లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు రోణంకి కృష్ణమ నాయుడు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సూర బాలకృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, మొగిలిపురి సీతారాం, బిపి రెడ్డి, బల్లెడ శ్యాం, తెప్పల మోహనరావు, మధు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాలకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యభద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని అందులో భాగంగానే నియోజకవర్గంలోని ఆమదాలవలస, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలోని 33 గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు, మూడు బ్లాక్ ప్రజా ఆరోగ్య యూనిట్లు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఒక సముదాయ ఆరోగ్య కేంద్రముల నిర్మాణం కొరకు రూ.1557.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి నిర్మాణం పూర్తయిన పిదప నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. నిధులు విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబునాయుడు, ఆరోగ్యశాఖామంత్రి సత్య కుమార్ యాదవ్‌కు, ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గరిమెళ్ల వర్ధంతి



అరసవల్లి : గరిమెళ్ల చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ళ సత్యనారాయణ వర్ధంతి సభ, 'గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం' ఆధ్వర్యంలో, జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూనివర్సిటీ లైబ్రరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కారసాల శ్రీనివాసరావు, 'సాహితీ స్రవంతి' జిల్లా కన్వీనర్ కె శ్రీనివాసు 'గరిమెళ్ళ స్మారకోపన్యాసం' చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో గరిమెళ్ళ నిర్వహించిన పాత్రను, నిస్వార్ధ సేవను గుర్తు చేశారు. స్వతంత్రోద్యమ కాలంలో అమలైన నాటి సాంఘిక సంస్కరణలు ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి, దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడగా, నేడు అమలవుతున్న ఆర్థిక సంస్కరణలు ప్రజల మధ్య అంతరాలు పెంచుతున్నాయని, కుల, మత ఉన్మాద శక్తులు పెట్రేగిపోయి ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతున్నాయని, ప్రజాతంత్ర వాదులు, మేధావులు రాజ్యాంగ స్ఫూర్తితో ఈ దారుణాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలన్నారు. ముందుగా గరిమెళ్ల విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం కోశాధికారి పి.సుధాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, కె.ఎస్ మూర్తి, రమణమూర్తి, భారతి, సాహితీ స్రవంతి నాయకులు కంచరాన భుజంగరావు, గరిమెళ్ల సత్యనారాయణ మనవడు అశోక్ లక్ష్మణ్, పెన్షనర్ల సంఘ నాయకులు పార్వతీశం, ఆదినారాయణమూర్తి, భోగెల ఉమా మహేశ్వర రావు, ఎల్ఐసి ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గరిమెళ్ల' జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

పోలాకి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ప్రజాకవి కీర్తిశేషులు గరిమెళ్ల సత్యనారాయణ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి బాడాన రాజు కోరారు. మండలంలోని ప్రియాగ్రహారంలో గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యనారాయణ రచనలు, జీవిత చరిత్ర, త్యాగం నేటి తరానికి తెలిసే విధంగా పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జగదీశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం తన ధన, ప్రాణాలను త్యాగం చేసిన గరిమెళ్ల నేటి తరానికి స్ఫూర్తిప్రదాత అని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆరో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో గరిమెళ్ల రచించిన మాకొద్దీ తెల్ల దొరతనం గేయం పాఠ్యాంశంగా చేర్చడం గర్వకారణ మన్నారు. ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఐ.గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్ల దొరతనం అను గేయం అందరిని ఆకట్టు కుంది. ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్. విశ్వేశ్వరరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఎస్.ధనుంజయ రావు, దుర్గారావు, అసిరినాయుడు, గౌరీశంకర్, శాంతి స్వరూప్, మల్లిబాబు, లక్ష్మి, రాజ మోహిని, తిరుపతిరావు, రామారావు, మోహనరావు, వెంకట రమణ, వెంకటరావు, సుజాత పాల్గొన్నారు.


పోలాకి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ట్రస్టు సభ్యులు

దుక్కు దున్నకుండా మొక్కజొన్న సాగు

లావేరు: మండలంలోని గురువారం తామాడ పంచాయతీ సూర్యనారాయణ పురం గ్రామ రైతులు గత మూడు సంవత్సరాలుగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కజొన్న యాంత్రీకరణ పద్ధతి ద్వారా సాగు చేయడం జరుగుతుంది. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు మాట్లాడుతూ ఈ డబుల్‌వీల్ మార్కర్ ద్వారా మొక్కజొన్న సాగు తక్కువ ఖర్చుతో దిగుబడి సాధించవచ్చునని, కూలీల కొరత కూడా తగ్గించ వచ్చునని, పది రోజుల ముందుగానే పంట చేతికి పొందుతుందని, ఇంకా రూ.5 వేలు వరకు ఖర్చులు తగ్గుతూ రెండు తడుల నీటిని ఆదా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు వైశ్యరాజుల వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టెన్నికాయిట్ పోటీలు

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం స్వర్గీయ సురేష్ రెడ్డి స్మారక టెన్నికాయిట్ ఓపెన్ పోటీలు నిర్వహించారు. బాలుర విన్నర్స్ సిహెచ్.తారకేశ్వరరావు, కె.ప్రవీణ్ కుమార్ రన్నర్స్ ఎల్. దిలీప్, బి.సిద్ధార్థ థర్డ్ ప్లేస్ ఎం.దామోదరం, ఎం.మణికంత, బాలికల విన్నర్స్ కె.ఇందు, టి.లావణ్య రన్నర్స్ ఎం.ప్రియదర్శిని, కె.కావ్య, థర్డ్ ప్లేస్ కె.జ్యోతిక, వై.మాధవి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రవికుమార్, వ్యాపారవేత్త మల్లా భద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య పాల్గొన్నారు.

రేపు మ్యాథ్స్ టాలెంట్ టెస్టు

నందిగాం : నందిగాంలోని ఎన్‌డిఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శ్రీనివాస రామానుజం జయంతి, మ్యాథ్స్ దినం సందర్భంగా శనివారం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టాలెంట్ టెస్టుకు 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ పేర్లను 9966364085 నమోదు, పూర్తి వివరాల కోసం సంప్రదించాలన్నారు.

యునిఫైడ్ సర్వే వేగవంతం

పలాస : ప్రభుత్వం చేపడుతున్న యునిఫైడ్ సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ వసంతకుమార్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఉన్న సభ్యుల వివరాలను వ్యక్తిగతంగా సేకరించాలని, జనవరి 12 నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం నుంచి గ్రామాల్లో సర్వే ప్రారంభించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒలు మెట్ట వైకుంఠరావు, సవర ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ప్రజాశక్తి- పలాస


పుస్తక ఆవిష్కరణ చేస్తున్న వక్తలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయడమే అమరవీరులకు మనం ఇచ్చిన ఘనమైన నివ్వాలని లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దిలే మల్లేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల భవనంలో వినోద మిశ్రా రాసిన పుస్తకావిష్కరణ సభలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటు, మతతత్వ శక్తులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నాయని విమర్శించారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సంపాదించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు కింద మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధిహామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, వివిధ పార్టీ నాయకులు కోనేరు రమేషు, పోతనపల్లి కుసుమ, కె.నీలకంఠం, దాసరి శ్రీరాములు, మద్దిలి రామారావు, మడ్డు బాబూరావు, వెంప టాపు భారతి, అరుణ, జీడి రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్‌కుమార్, వీరస్వామి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమే లక్ష్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పర్యావరణ పరిరక్షణ, సామాజిక స్పృహ కలిగినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం మూడవ రోజులో భాగంగా కేశవరావుపేటలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం వల్ల భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని, ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. 120 మంది పాల్గొన్న ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు, బురిడి కంచరాం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు ఎచ్చెర్ల, ఎస్.ఎస్.ఆర్ పురం, ఎస్.ఎం.పురం గ్రామాల్లో పర్యటించి వినూత్న సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎచ్చెర్లలో ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పాఠశాల విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాల ను వివరించారు. ఎస్.ఎం.పురంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేస్తూ, ఎస్.ఎస్.ఆర్ పురంలో స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎఒ డా. ముని రామకృష్ణ, డీన్ డా.శివరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డి నేటర్ డా. ముకుందరావు, క్యాంపస్-2 ఇన్‌ఛార్జి సాగర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, పి.గా యత్రి, టి. అసిరినాయుడు, ఆర్.పద్మావతి, వాలంటీర్లు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

తనపై లేనిపోని ఆరోపణలు చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని నౌపడ వెలుగు సిఎం డి.సాయిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నౌపడ పోలీస్ స్టేషన్‌లో తనపై అవినీతి ఆరోపణ చేసిన మాజీ సిఎఫ్ మాధవీలత, కనిరెడ్డి భాస్కర్‌రెడ్డిలపై గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరు నెల 30న మదర్ థెరిసా గ్రూపుకి లోను రెన్యువల్‌ను చేయడం వాస్తవమేనని కానీ, ఈ విషయం బ్యాంకు అధికారులు తమకు తెలియజేయలేదని తెలిపారు. గ్రూప్ సభ్యులకు, లీడర్ కు ఉన్న విభేదాలు కారణంగా రెన్యువల్ చేయిగా, వచ్చిన రూ.7.20 లక్షలు వారి పొదుపు ఖాతాలోనే ఉన్న ఉన్న ఇప్పటి వరకు దానిని పంచుకోలేదని వివరణ ఇచ్చారు. ఈ కారణంగా వారి అకౌంట్‌లోనే డబ్బులు ఉన్నా సరే తీసుకోకపోవడం, ఆపై బ్యాంకు వడ్డీలు వేయడం, దానిని తనపై నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెన్యువల్ చేసేటప్పుడు బ్యాంకు అధికారులు తమకు సమాచారం ఇవ్వకపోవడం, అలాగే గ్రూప్ సభ్యులు కూడా ఈ విషయం తెలియకపోవడం వల్ల లోను రెన్యువల్ విషయం ఆలస్యంగా తెలిసిందని చెప్పారు. దీంతో అదే గ్రూపులో ఉన్న మాజీ సిఎఫ్ ఇదే అదునుగా తనపై సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేశారని తెలిపారు.

సమాఖ్య ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి- కొత్తూరు

మండల మహిళా సమాఖ్య ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్లు బాహాబాహికి దిగారు. గత మూడుసార్లు వాయిదా పడుతూ వస్తున్న ఎన్నిక గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహించారు. డమ్మీలు ఎవరైనా ఉంటే బయటికి రావాలని ఒక గ్రూపు చెప్పడంతో మాట మాటా పెరిగి తోపులకు దారితీసింది. ఒక దశలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఎన్నిక తాత్కాలికంగా వాయిదా వేశారు. అనంతరం ఒక గ్రూపు గ్రామైక్య సంఘం సభ్యులు ఎపిఎం లలితకుమార్‌ని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

కృష్ణచైతన్య పరామర్శ

నరసన్నపేట : నరసన్నపేట పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లపల్లి వీరేష్‌ని గురువారం పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పరామర్శించారు. ఈయన వెంట పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖర్‌రావు, సర్పంచ్ బుర్లల్లి శంకర్, మండల విప్ వైశ్యరాజు కేశవరాజు, ఎంపిటిసి పొట్నూరు సాయిప్రసాద్, నాగవంశపు డేవిడ్, తంగుడు జోగారావు ఉన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

పలాస : విద్యాశాఖ ఆధ్వర్యాన పలాస రైల్వే క్రీడా మైదానంలో డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం సిఐ రామకృష్ణ క్రీడా మైదానంలో ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. వివిధ మండలాల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా పి.తవిటయ్య, తోటారావు, సిహెచ్.పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, పి.గజేంద్ర, రవికాంత్, గణేష్, ప్రకాశ్ వ్యవహరించారు. శుక్రవారంతో పోటీలు ముగియనున్నాయి.

విఠల్‌రావుకు సన్మానం

పలాస : పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన పి.విఠల్‌రావును కార్యదర్శులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సద్గుణబాబు, సుధాకర్, మీనాక్షి, సాయి, ఆశా, ఖగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వేణుగోపాలపురం డిపోలో కార్డుదారులను విచారిస్తున్న డిటి అరుణ

రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ

లావేరు: మండలంలోని అన్ని రేషన్ డిపోల్లోను డిసెంబరు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం, పంచదార తదితర సరుకులను కార్డుదారులకు అందజేయడం జరిగిందని సిఎస్‌డిటి అరుణ అన్నారు. ఇటీవల ప్రభుత్వం సరుకులు తీసుకోవడం, సరుకుల నాణ్యతపై ఐవిఆర్ఎస్ ఫోన్‌కాల్ ద్వారా కార్డుదారులకు అడిగినప్పుడు ఇంకా సరుకులు తీసుకోలేదని, నాణ్యతలేదని నెగిటివ్‌గా చెప్పడంతో లావేరు మండలంలో 8, రణస్థలం మండలంలో 10 డిపోల్లో నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రావడంతో దీనిపై సిఎస్‌డిటి అరుణ గురువారం తాళ్లవలస, వేణు గోపాలపురం గ్రామాల్లోని డిపోలను పరిశీలించారు. విచారణ చేపట్టగా అందురూ సరుకులు తీసుకున్నట్టు చెప్పారని, అలాగే సరుకులు పంపిణీ 96 శాతం తీసు కున్నట్టు ఆన్‌లైన్ నివేదిక ఉందని చెప్పారు. పోర్టు బుల్ట్ కార్డులు ద్వారా కొంతమంది తీసు కున్నార న్నారు. డిపోలు పరిశీలన, కార్డుదారులను విచారణ చేసి సంతృప్తికరంగా ఉందన్నారు. ఈమెతో డీలర్లు ముప్పిడి రమేష్, శ్రీను, కార్డుదారులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అత్యాచారయత్నం

- తప్పించుకున్న మైనర్ బాలిక
- ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలిక ఎరుపిల్లి దీపికపై ఆటో డ్రైవర్ చేసిన అత్యాచార యత్న సంఘటన వెలుగులోకి తాజాగా వచ్చింది. ఈ సంఘటనపై ఎస్ఐ ఎస్. బాలరాజు ఆటోడ్రైవర్ గేదెల సుధాకర్‌పై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు దీపిక సరుబుజ్జిలి మండలం రొట్టవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ ప్రతిరోజు సైకిల్‌పై వెళ్లి గ్రామానికి వస్తూ ఉండేది. అయితే ఇటీవల ఆమె సైకిల్ మరమ్మతులకు గురికావడంతో తోటి స్నేహితులతో కలిసి ఆటోపై పాఠశాలకు వెళ్లి వస్తున్న క్రమంలో భాగంగా ఈనెల 16న పాఠశాల విడిచిపెట్టిన సమయంలో కొండవలసకు చెందిన గేదెల సుధాకర్ ఆటోపై తన స్నేహితులతో కలిసి బయలుదేరారు. మునగవలస గ్రామానికి చెందిన స్నేహితులు ఆ గ్రామ జంక్షన్‌లో దిగిపోవడంతో ఆటోడ్రైవర్ దీపికతో కలిసి కొండవలస గ్రామం వెళ్తా మార్గమధ్యంలో మామిడితోట వద్ద ఆటో నిలుపుదల చేసి బాలికను ముద్దాడటానికి ప్రయత్నించగా బాలిక చాకచక్యంగా ఆటో డ్రైవర్ సుధాకర్ నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు జరిగిన సంఘటనను వివరించింది.

తమ కుమార్తె తెలిపిన విషయాన్ని తల్లిదండ్రులు సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపి ఫిర్యాదు చేయగా సంఘటన జరిగిన ప్రాంతాన్ని సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి పరిశీలించగా ఆ ప్రాంతం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని తెలియజేయడంతో బాధితులు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. తమ కుమార్తె దీపికపై జరిగిన సంఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.


తహశీల్దార్‌పై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తహశీల్దార్ సీతారామయ్యపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు డిమాండ్ చేశారు. మండలంలోని నగరంపల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తప్పులు నమోదైన భూమి సర్వే నంబర్లు సరిచేయడం, మ్యుటేషన్ల కోసం ఖర్చులు అంటూ కొంత సొమ్ము వసూలు చేస్తున్నారే తప్ప సంవత్సరం గడిచిన పనులు కావడం లేదన్నారు. ఎవరైనా భూములు అమ్ముతామన్నా... అమ్మే భూమి సర్వే నంబర్లు వెబ్ ల్యాండ్‌లో మాయమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొంత డబ్బులు ఇస్తే మళ్లీ ప్రత్యక్షమవుతున్నాయని విమర్శించారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైస్ మిల్లర్స్ దోపిడీని అరికట్టాలి

ఆరుకాలం కష్టపడి, వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొని చేతికొచ్చిన పంటను రైస్ మిల్లర్స్ అప్పనంగా దోచుకుంటున్నారని అన్నారు. 80 కిలోలకు రైతుల నుంచి అదనంగా మరో రెండు కేజీలు తీసుకుంటున్నారు. దానికీ సంతృప్తి చెందకుండా తేమశాతం అధికంగా ఉందని మరో మూడు కేజీలు అదనంగా అడగటం ఎంత దారుణమో అర్థం అవుతుందని అన్నారు. సచివాల యాల దగ్గర చూస్తే 14 శాతం తేమ ఉన్న ధాన్యం మిల్లర్స్ దగ్గరికి వెళ్లేసరికి 20 శాతం తేమ ఉందని చెబుతూ అదనంగా మూడు కేజీలు ఇవ్వాలి, లేదంటే ఆరబెట్టి తీసుకురండని చెప్పడంలో ప్రభుత్వం బలహీనత కనిపిస్తుం దని పేర్కొన్నారు. మరో పక్క బ్యాంకు గ్యారంటీ లేదని చెబుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్.చంద్రయ్య, ఎన్.మోహనరావు, బి.రామకృష్ణ, డి.సుగుణావతి, ఎన్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనందరావు


గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న విప్ అశోక్

'ఉజ్వల'మైన పథకం

విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, అందులో ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ 'ఉజ్వల'మైన పథకమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉజ్వల 3.0 ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా పూర్తిగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందిస్తూ మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని అన్నారు. భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కె.వెంకటరావు, స్లీపింగ్ పార్టనర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో 126 ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, జడ్‌ఆర్ యుసిసి సభ్యుడు శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల చరిత్ర తెలియాలి

ప్రజాశక్తి- పలాస

స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన అనేక మంది వీరుల చరిత్రలను తెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని, వారి స్ఫూర్తితో నిజమైన స్వాతంత్ర్యం సాధించుకోవాలని పిడిఎం రాష్ట్ర బాధ్యులు వై.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మాకన్నపల్లిలో పిడిఎఫ్ జిల్లా కార్యదర్శి సాలిన వీరస్వామి అధ్యక్షతన భారత స్వతంత్ర పోరాటంలో అమరులైన విప్లవ వీరులు అష్ఫాఖులాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్, రోషన్ సింగ్, రాజేంద్రనాథ్ లహరిలను గురువారం స్మరించుకుంటూ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్రం సమానత్వం కావాలని, ఆనాటి దేశభక్తులు పోరాడి ప్రాణాలర్పించారని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ మాట్లాడుతూ అమరుల త్యాగాలను దేశ ప్రజల దృష్టి నుంచి మళ్లించి మేమే దేశ భక్తులుగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నా ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వంకల మాధవరావు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టులపైన, కమ్యూనిస్టు భావజాలంపైన బిజెపి నాయకుల దాడులకు వ్యతిరేకంగా విశాల ఐక్య సంఘటన ఏర్పాటుకు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో అరసం నాయకులు చింతాడ కృష్ణారావు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, ప్రగతి శీల కార్మిక సమైక్య జిల్లా బాధ్యులు మద్దిల ధర్మారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ప్రభాకరరావు, రైతు సంఘం బాధ్యులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

మెళియాపుట్టి : మండలంలోని చాపర జెడ్‌పిహెచ్‌ఎస్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఎస్.దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభరావు ప్రారంభించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో గ్రూప్, ఇండివిజువల్, టీచర్ ఇండివిజువల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సస్టైనబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్, సోలార్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, రిక్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్, హెల్త్ అండ్ హైజిన్, వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్ వంటి కాన్సెప్ట్స్‌పై విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌కు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాస గీత హాజరయ్యారు. ప్రాజెక్టు సెలక్షన్ కమిటీ జడ్జిలుగా పి.ఎ.రామానంద వై.కృష్ణకుమారి వ్యవహరించారు.

కోటబొమ్మాళి: పిల్లల్లో దాగి ఉన్న విజ్ఞానం, ఆలోచనలు వెలికి తీయడానికి ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి 2 డి.గోవిందరావు అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వమించిన మండలస్థాయి సైన్స్ ప్రదర్శనలో 14 పాఠశాలల విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సైన్స్ ప్రదర్శనలో ఎంజెపి పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వర్షపు నీరు సంరక్షణ ప్రాజెక్టు, అలాగే జర్జంగి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ హితమైన పురుగుల మందులు వాడకం అనే ప్రాజెక్టు, కురుడు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన కార్బో శుద్ధీకరణ ప్రాజెక్టు, కోటబొమ్మాళి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన పారిశ్రామిక ప్రయోజనకరమైన వాయువు ప్రాజెక్టు, కెజిబివి విద్యార్థులు చేసిన జీవిత ప్రక్రియ ప్రాజెక్టు, నిమ్మాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ఆరోగ్యం పరిశుభ్రత ప్రాజెక్టు మండల స్థాయి నుంచి ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపుతున్నట్లు తెలిపారు. అధ్యాపకులు టి.సంతోషి, ఎం.సోమశేఖర్, ఎస్.జగదీశ్వరరావు, వై.మాధవి వ్యవహరించారు.

ఆమదాలవలస : మండల స్థాయిలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించినట్లు మండల విద్యాశాఖాధికారి కె.అప్పల రాములు తెలిపారు.


ఆమదాలవలస : సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థులు


మెళియాపుట్టి : పోటీలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

ఈ ఎగ్జిబిషన్‌కు మొత్తం 48 ప్రాజెక్టులు రాగా వాటిలో గ్రూపుల వారీగా ప్రాజెక్టులు 35 వ్యక్తిగత ప్రాజెక్టులు 12 టీచర్ ప్రాజెక్టు ఒకటి ఉన్నట్లు తెలిపారు. గ్రూపు ప్రాజెక్టుల్లో నుంచి 4 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపిక కాగా వ్యక్తిగత ప్రాజెక్టుల్లో నుంచి 2 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, టీచర్ ప్రాజెక్టు ఒక్కటే కావడంతో అది కూడా జిల్లాస్థాయికి సెలెక్ట్ అయిందని, మొత్తం ఏడు ప్రాజెక్టులు జిల్లాస్థాయికి అర్హత సాధించినట్లు తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈనెల 19 వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు మనసబుపేటలో ఉన్న గాయత్రీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వద్దకు తప్పనిసరిగా హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేసి సకాలంలో పంపించాలని కోరారు. అతి తక్కువ సమయంలోనే ఈ కార్యక్రమానికి స్పందించి విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన మండల యూనియన్ లీడర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- పలాస


శిరీష, ఎమ్మెల్యే

ఈ నెల 20న స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన కాశీబుగ్గలో ఈ నెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గలోని సాయి శిరీష డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలు అభ్యర్థులను ఎంచుకుంటాయన్నారు. ఈ జాబ్‌మేళాలో 600కు పైగా ఉద్యోగ అవకాశాలు ఆయా కంపెనీలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్హతలను బట్టి ఆకర్షణీయమైన వేతనాన్ని అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులు కంపెనీల చుట్టూ ఇంటర్వ్యూలకు తిరిగే అవసరం లేకుండా ఆయా కంపెనీలనే నిరుద్యోగుల వద్దకు తీసుకువచ్చి వారి సమయాన్ని ఆదా చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేవారు కమాండ్ కంట్రోల్ రూమ్ 6301046329, 6301045132 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న శైలజ

ఇంటి పన్ను వసూలు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని డిడిఒ బొడ్డేపల్లి శైలజ, టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ డిప్యూటీ ఎంపిడిఒలకు సూచించారు. డిడిఒ కార్యాలయంలో పలాస డివిజన్ పరిధిలో డిప్యూటీ ఎంపిడిఒలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలు చేయడంలో డివిజన్ వెనుకంజలో ఉందని అన్నారు. కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి త్వరగా వసూలు చేసే విధంగా చూడాలన్నారు. స్వామిత్వ సర్వే నత్తనడకన సాగుతోందని, గ్రామాల్లో కుటుంబ సభ్యుల ఆస్తులు, గ్రామ కంఠం వివరాలను సర్వే చేపట్టి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. సచివాలయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే అటువంటి సచివాలయం ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, జి.వి.స్వామి పాల్గొన్నారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న రమేష్

చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల జీవన విధానంలో ప్రతిరోజూ ఏదో ఒక వస్తువును కొనుగోలు చేస్తూ, వినియోగిస్తున్న నేపథ్యంలో కొనుగోలుదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ వినియోగదారుల హక్కుల చట్టంపై విధిగా అవగాహన కలిగి ఉండాలని టిడిపి జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మొదలవలస రమేష్ అన్నారు. గురువారం జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా పట్టణ శివారున ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ మండల వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనైతిక వ్యాపార పద్ధతులు, మోసపూరిత ప్రకటనల కారణంగా సామాన్య ప్రజలు నష్టపోతున్నారన్న ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం 1986 డిసెంబర్ 24న వినియోగదారుల హక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. పెరుగుతున్న వాణిజ్య వ్యాపార విధానాలకు అనుగుణంగా ఈకామర్స్ ఫ్లిప్‌కార్ట్ అమెజాన్ టెలీ మార్కెటింగ్ డిజిటల్ చెల్లింపులు వంటి ఆధునిక వ్యాపార వ్యవస్థల్లో వినియోగదారులు ఎదుర్కొనే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని 2019లో ఈ చట్టాన్ని సవరించారని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత రక్షణ కల్పించేందుకే వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ చట్టం పనితీరును, జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉన్న వినియోగదారుల కోర్టుల సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని, అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు తాళాబత్తుల ధనుంజయరావు, ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల క్లబ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం వినియోగదారుల క్లబ్ కార్యక్రమం వివరాలు ఈ వారోత్సవాల్లో విద్యార్థుల భాగస్వామ్యం గురించి వివరిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్లబ్ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి టీ షర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, డి.గోపాలకృష్ణ, సిహెచ్ ఆదినారాయణ, సిహెచ్.యతిరాజారావు, ఎస్.దాసు, దాసరి దీనబంధు, నారాయణరావు, ఎస్.పుష్ప, కె.కిరణ్ పాల్గొన్నారు.

పిల్లల నడవడికపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- లావేరు

పాఠశాలకు వెళ్తున్న తమ పిల్లలు నడవడిక విద్యపై ఉపాధ్యాయులపైనే పెట్టకుండా తల్లిదండ్రులు ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర అన్నారు. లావేరు జెడ్‌పి పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా


మాట్లాడుతున్న తోటయ్యదొర

హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ జీవితంలో ప్రయోజకులయ్యేందుకు మెట్టు పదోతరగతేనని, ఇక్కడ ఉపాధ్యాయులు చెప్పినట్టుగా విని భవిష్యత్‌కు ప్రణాళిక వేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.జగన్నాధరావు మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 100 రోజులు ఎడ్యుకేషన్ ప్రణాళికలో భాగంగా మార్చి 15 నుంచి పబ్లిక్ పరీక్షలు అని రోజు పాఠశాల క్లాసులు వుంటాయని ఆదివారం కూడా పనిదినలేనని చెప్పారు. పిల్లలు పాఠశాలకు సమయానికి వెళ్తున్నారా, ఇంటికి సమయానికి చేరుతున్నారా లేదా అనే దానిపై ఈ 100 రోజులు తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. సమావేశంలో లంకలపల్లి శ్రీనివాసరావు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఏర్పాటు చేసిన సైకిల్ షెడ్ వద్ద ప్రతినిధులు

సైకిల్ షెడ్ ఏర్పాటు

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం వల్లేవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మనబడి వెల్ఫేర్ అసోసియేషన్, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.25 వేల వ్యయంతో సైకిల్ షెడ్ నిర్మించారు. టెక్కలి చెందిన కోరాడ రాంప్రసాద్ రూ.10 వేలు, తర్లన నారాయణమూర్తి రూ.5 వేలు, కోటబొమ్మాళి ఆర్‌ఎస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వారణాసి సాయి కిషోర్ రూ.5 వేలు విరాళాలు అందించారు. 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థులు షెడ్‌కు సిమెంట్ గచ్చు వేయించారు. అలాగే గోవిందపురం చెందిన రేయ్యి నీలకంఠేశ్వరరావు విద్యార్థులకు రూ.10 వేల విలువైన ఐడి కార్డులు అందించారు. దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.


క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

క్రీడా పరికరాలు పంపిణీ

పలాస : యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడలు మంత్రిత్వశాఖ మేరా యువ భారత్ వారి సౌజన్యంతో యువతకు క్రీడా పరికరాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. విరివిగా క్రీడల్లో పాల్గొనడం వల్ల ప్రతిభ బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరకట్ల విఠల్‌రావు, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

కవిటి: డిప్యూటీ ఎంపిడిసి వరప్రసాద్ జగతి సచివాలయాన్ని గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ముఖ్యంగా సచివాలయానికి వచ్చే ప్రజలతో సందర్భోచితంగా వ్యవహరించి వారి పనులు చేసి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న వరప్రసాద్

ఆరుతడి పంటలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- పలాస

రబీ సీజన్‌లో ఆరు తడి పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం.రామారావు, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సిహెచ్. వెంకటరావు అన్నారు. పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ కార్యాలయంలో గురువారం యాజమాన్య పద్ధతులపై రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలకు విఎఎసిఎస్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ పంటలైన అపరాలు, వేరుసెనగ, నువ్వులు మొక్కజొన్న పంటల పండించడంతో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఖరీఫ్‌లో నష్టం వాటిల్లితే వాటి స్థానంలో నష్టాన్ని భర్తీ చేసేందుకు రబీ పంటలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాలకు వేరు సెనగ విత్తనాలు అందుబాటులో


మాట్లాడుతున్న వెంకటరావు

ఉన్నాయని తెలిపారు. రబీ సీజన్లో ఆరు తడి పంటలకు ఎరువులు, పురుగుల మందులు వినియోగంపై వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్ కృషి విజ్ఞాన కేంద్రం ఆముదాలవలస శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మెళియాపుట్టి ఎఒలు పోలారావు, జి.నాగరాజు, ధనుంజయ, దానకర్ణుడు పాల్గొన్నారు.

నరసన్నపేటకు చేరిన అభ్యుదయం సైకిల్‌యాత్ర


సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభించిన అభ్యుదయ సైకిల్ యాత్ర గురువారం ఉదయం 11 గంటలకు నరసన్నపేట చేరుకుంది. మండలంలోని మడపాం టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వాగతం పలికారు. అనంతరం సైకిల్ తొక్కి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త బగ్గు అర్చన, టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, నరసన్నపేట సిఐ మరడాన శ్రీనివాసరావు, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట ఎస్ఐలు ఎస్ఐ కె.శేఖర్‌రావు, బి.అశోక్బబు, రంజిత్, బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రూ.15 వేలు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడు పడాల రాజు మృతి చెందారు. ఆయన దహన సంస్కారాలు నిర్వహించేందుకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం మృతుడు కుటుంబ సభ్యులకు చైర్మన్ బల్ల గిరిబాబు రూ.15 వేలు చెక్కును పంపిణీ చేశారు. మృతుడు కుటుంబానికి పాలక వర్గం అండగా


ఆర్థికసాయం అందజేస్తున్న చైర్మన్ గిరిబాబు

ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఇ.శ్రీనివాసులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం మార్పు దుర్మార్గ చర్య

ఆమదాలవలస : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పేరును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వి.బి.జి రామ్‌జీ పేరుగా మార్చడం దుర్మార్గమైన చర్యని రాష్ట్ర మాజీ పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. గురువారం పట్టణంలోని వన్వే జంక్షన్ వద్ద నున్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, నియంతృత్వ విధానాలను విడనాడాలన్నారు. యుపిఎ ప్రభుత్వం గ్రామాల్లో వేసవికాలంలో వలసలను నివారించాలన్న ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా నేటికీ గ్రామీణ ప్రజలు తమ గ్రామాల్లోనే ఉపాధి పొందుతూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల జీవితాలతో ముడిపడిన మహోన్నత పథకం పేరు మార్చడమే కాకుండా సరికొత్త


నిరసన వ్యక్తం చేస్తున్న అన్నాజీరావు తదితరులు

బిల్లులు తీసుకువచ్చి దాని అసలు ఉద్దేశాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, సువ్వారి రమణ, పప్పల అప్పారావు, చింతాడ అప్పారావు, సాయిరాం, దాలయ్య, త్రినాథ్, భాషా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి


ఇచ్ఛాపురం : సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- పలాస

సాంకేతిక పరిజ్ఞానంతో మరింత అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం పలాస, మందస ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 382 అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందిస్తున్న 5జి సెల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీని జోడించాలన్న లక్ష్యంతో సిఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. పిల్లల భవిష్యత్‌ను, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అన్ని విభాగాలను కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ పార్వతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇచ్ఛాపురం కవిటి మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం మంజూరు చేసిన 5జి మొబైల్ సెల్ ఫోన్లను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పంపిణీ చేశారు.

పలాస : అంగన్వాడీలకు కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ కె.పార్వతి 5జి సెల్ ఫోన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ గంగమ్మ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో నారాయణమూర్తి

ఎమ్మెల్యేను కలిసిన నారాయణమూర్తి

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాను దర్శకత్వం, నటించిన యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా ఈ నెల 24న పలాసలో ముందస్తు సినిమా తిలకించేందుకు రావాలంటూ ఆహ్వానం పలికారు. సినిమాకు తమ అనుచరులతో కలిసి హాజరు అవుతామని ఎమ్మెల్యే తెలిపారు.

సైకిల్‌యాత్ర ప్రారంభం

రణస్థలం రూరల్ : మండలంలోని నారువ పంచాయతీ నుంచి 11 మంది అయ్యప్పస్వాములు దీక్ష ముగించుకొని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుటకు సైకిల్ యాత్రను గురువారం పైడిభీమవరం వద్ద ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులను అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వద్దాది శ్రీనివాసరావు, పోపూరి శివరామ ప్రసాద్, పిషిని జగన్నాధం నాయుడు, పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, సిరపు పైడయ్య రెడ్డి పాల్గొన్నారు.

ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఎంపిడిఒ త్రినాథ్ గురువారం దూగనపుట్టుగ పంచాయితీలో పర్యటించి పారిశుధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. చెత్త సేకరణ కార్యక్రమం అమలు తీరును పరిశీలించిన ఆయన, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. అలాగే పంచాయతీ భవన నిర్మాణ పనుల


వాటర్ ట్యాంకు పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాథ్

పురోగతిని పరిశీలించిన ఎంపిడిఒ, పాడుపడిన నీటి ట్యాంక్ సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.